



డిఇఒ ప్రేమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యా శాఖ అధికారిగా నియమితులైన ఎన్. ప్రేమ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిఇఒగా పని చేసిన లింగేశ్వరరెడ్డి ఆర్‌జెడిగా ఉద్యోగోన్నతిపై గుంటూరు వెళ్లిన విషయం తెలిసిందే. మన్యం జిల్లా డిఇఒగా ఉన్న ప్రేమ్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును, కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. డిఇఒకు కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ

మిమ్స్ మొండివైఖరి

- ఖాళీగా మారిన ఆసుపత్రి
- సదుపాయాలు లేక ప్రత్యామ్నాయం చూసుకుంటున్న వైనం
- యాజమాన్యం నిరంకుశ వైఖరే కారణం
- కొనసాగుతున్న ఉద్యోగుల విధుల బహిష్కరణ, నిరసన
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



రోగులు లేక ఖాళీగా ఉన్న మిమ్స్ ఆస్పత్రి

దురాశ దు:ఖానికి చేటు అంటారు పెద్దలు. దీనికి నిరంకుశత్వం తోడైతే ఎలా ఉంటుందో వేరేగా చెప్పనక్కర్లేదు. నెల్లిమర్ల మిమ్స్ (మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) లో అచ్చంగా అదే పరిస్థితి ఏర్పడింది. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను యాజమాన్యం లోబరుచుకుని, వారికోసం నిరంతరం పోరాడుతున్న సిఐటియును విచ్ఛిన్నం చేసింది. నాలుగేళ్లగా శ్రమ, సీనియార్టీకి తగ్గ వేతనాలు ఇవ్వకపోవడంతోపాటు మునుపటి మాదిరిగా డిఎలు చెల్లించకపోవడం, వేధింపులకు గురిచేయడం, ప్రశ్నించినవారిపై సస్పెన్షలతో బెదిరింపు చర్యలకు పాల్పడడంతో ఉద్యోగులు తిరిగి సిఐటియును ఆశ్రయించారు. సాధించిన హక్కులను సైతం యాజమాన్యం కాలరాస్తుండడంతో ఈనెల 1వ తేదీనుంచీ విధులు బహిష్కరించారు. దీంతో, మిమ్స్ ఆసుపత్రి మొత్తం ఖాళీ అయ్యింది. అటు రోగులు, ఇటు ఉద్యోగులు లేక వెలవెలబోతోంది. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినా పరిష్కారానికి చొరవ చూపలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2003లో ఏర్పాటైన మిమ్స్ ఆసుపత్రిలో సుమారు 1000 పడకలు ఉన్నాయి. జిల్లాలో గత ఏడాది వరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ అంటూ లేకపోవడంతో కొన్ని సేవలకు మిమ్స్ గత్యంతరంగా ఉంది. ఈనేపథ్యంలో ఇప్పటికీ రోజూ వేలాది మంది ఔట్‌పేషెంట్లు, వందలాది మంది ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. మరోవైపు విద్యార్థుల నుంచి కోట్ల రూపాయలు ఫీజులు వసూలు చేస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా అందులోని పెద్దల సహకారం మిమ్స్ యాజమాన్యానికి ఉండడం వల్ల ఇన్నాళ్లూ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ అంటూ రాకుండా పోయిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ సంగతి కాస్త అటుంచితే మెడికల్ కాలేజీ, భోదనాసుపత్రిలో నర్సులు, ఎన్ఎంలు, ఆయాలు, వార్డు బాయ్స్‌తోపాటు ఎలక్ట్రికల్, పబ్లింగ్, అడ్మినిస్ట్రేషన్, ల్యాబొరేటరీ, సెక్యూరిటీ తదితర విభాగాల్లో సుమారు 500మంది పనిచేస్తున్నారు. వీరంతా ఏళ్ల తరబడి చాకిరీ చేస్తున్నా వేతనాల పెంపు, నెలవారీ సెలవులు, డిఎ సదుపాయం, వేతన సవరణ అంటూ ఉండేవి కాదు. దీనికి తోడు యాజమాన్యం నిరంకుశ వైఖరితో ఉద్యోగులు కూడా సంఘటితంగా ఉండలేని దుస్థితి ఉండేది. ఇంకా చెప్పాలంటే ఉద్యోగులు, ఒకరి ఇబ్బందులు మరొకరికి చెప్పుకోలేని పరిస్థితి ఉండేది. ఇదంతా 2011 సంవత్సరం నాటి ముందు మాట. అప్పటి వరకు పుట్టెడు దుఖంతో యాజమాన్యం వద్ద నలిగిపోతున్న ఉద్యోగులు అదే సంవత్సరం ఫిబ్రవరిలో సిఐటియును ఆశ్రయించారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని నాయకత్వానికి వివరించారు. సిఐటియు కార్మికులను ఐక్యం చేసింది. మిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసింది. మిమ్స్‌లోని 90శాతం ఉద్యోగులు సభ్యులుగా చేరారు. దీంతో, దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తూ అప్పటి వరకు ఏకపక్ష వైఖరితో ఉన్న మిమ్స్ యాజమాన్యం మెడలు వంచింది. కార్మికుల ఐక్యత, సిఐటియు పోరాటాల ముందు యాజమాన్యం పాచికపారలేదు. దిగివచ్చిన యాజమాన్యం 2011లోనే రెండేళ్ల వేతన ఒప్పందానికి ముందుకు వచ్చింది. ఆ తరువాత 2013, 2015, 2017 సంవత్సరాల్లో క్రమం తప్పకుండా వేతన ఒప్పందాలు జరిగాయి. 2011 అక్టోబర్ నుంచి 2020 అక్టోబర్ వరకు క్రమం తప్పకుండా డిఎ పెరింగింది. ఇందుకు తగ్గట్టే ఉద్యోగులు యాజమాన్యానికి సహకరించారు. 2019 – కోవిడ్ సందర్భంగా ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలందించారు. ఓ రకంగా చెప్పాలంటే ఇక్కడి ఉద్యోగుల అంకితభావం అటు కాలేజీ, ఇటు బోధనాసుపత్రి ప్రతిష్ట పెంచింది. అయినా కార్మికులకు చెల్లిస్తున్న జీతభత్యాలు, ఇతర సదుపాయాల పట్ల మాత్రం కంటగింపుగా మారింది.

లాభాపేక్షలో పడ్డ యాజమాన్యం 2019లో చేయాల్సిన వేతన ఒప్పందానికి ముందుకు రాలేదు. ఇతర సదుపాయాల విషయంలో మీనమేషాలు లెక్కించింది. దీంతో, సిఐటియు నాయకత్వంలో కార్మికులు గట్టిపోరాటాలే నిర్వహించారు. దీంతో, ఎలాగైనా కార్మికల ఐక్యతను దెబ్బతీయాలని భావించిన యాజమాన్యం కొంతమందిని లోబరుచుకుంది. మాయమాటలతో కార్మికులను బురిడీకొట్టించి సిఐటియు మైనార్టీలో పడేలా చేసింది. ఇదే అదునుగా భావించి యాజమాన్యం డిఎలను నిలిపివేసింది. ఇతర సదుపాయాలనూ క్రమంగా రద్దుచేసింది. యాజమాన్యం మాయయాటలకు అప్పటికే అసంఘటితంగా మారిన కార్మికులు అన్యాయాన్ని ఎదురించలేని పరిస్థితి ఏర్పడింది. 2021 నుంచి పనిలో చిన్నపాటి పొరపాట్లు జరిగినా జరిమానాలు విధించడం లేదా వేతనాల నుంచి కోత విధించడం వంటి దుర్మార్గ చర్యలకు దిగింది. చివరకు బలవంతపు అంగీకార లెటర్లు రాయించడం వరకు వెళ్లింది. ఇటీవల కాలంలో వేధింపులు ముమ్మరం చేయడంతోపాటు చిన్నపాటి పొరపాట్లను సాకుగా చూపి పలువురిని సస్పెండ్ చేసింది. దీంతో, యాజమాన్యం నిజస్వరూపం తెలుసుకున్న కార్మికులు తిరిగి సిఐటియును ఆశ్రయించారు. తమపక్షాన యాజమాన్యంతో పోరాడాలని, వేతన సవరణ చేయడం లేదని, ఏడుసార్లు డిఎ పెంచాల్సి ఉందని, వేధింపులు, బెదిరింపులు ఎక్కువయ్యాయని చెప్పడంతో సిఐటియు మరోసారి పోరాటానికి దిగింది.

పలుమార్లు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా సానుకూల వైఖరి లేకపోవడంతో సిఐటియు నాయకత్వంలో ఈనెల 1వ తేదీ నుంచీ కార్మికులు విధులు బహిష్కరించి, ఆసుపత్రి ఎదుటే నిరసన దీక్ష చేపట్టారు. ఈనెల 5న కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు తమ సమస్యను విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 7వ తేదీన కార్మిక శాఖ డిప్యూటీ కమిషర్ (డిసిఎల్) చర్చలు ఏర్పాటు చేసినప్పటికీ సిఐటియు నాయకులతో చర్చించేందుకు యాజమాన్యం నిరాకరించింది. దీంతో, సిఐటియు నాయకులు లేకుండా తాము కూడా చర్చలకు వచ్చేది లేదంటూ కార్మికులు కూడా ఖరాఖండిగా తేల్చిచెప్పారు. దీంతో, విశాఖలోని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సమక్షంలో చర్చలు వెళ్లాలని డిసిఎల్ సూచించారు. యాజమాన్యం మొండివైఖరి వీడకపోతే విధుల్లో చేరేది లేదని కార్మికులు, సిఐటియు నాయకులు చెబుతున్నారు.



కలెక్టరేట్ వద్ద రహదారిపై బైఠాయించిన ఆశాకార్యకర్తలు

ఆశా వర్కర్లపై నిర్బంధం తగదు

కలెక్టరేట్ వద్ద బైఠాయింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేసేందుకు ప్రయత్నించడంతో పాటు గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద రహదారిపై ఆశాకార్యకర్తలు బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ మాట్లాడుతూ ఆశాలను గృహ నిర్బంధించి, రైళ్లలో, బస్సుల్లో అడ్డుకొని అక్రమంగా అరెస్టులు చేసి, మగ పోలీసులను పెట్టి భయభ్రాంతులకు గురి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో వైసిపి నియంతృత్వ పాలన సాగిస్తుందని, ప్రశ్నించే వారి గొంతు నులిమి, పోలీస్ నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని మండిపడ్డారు. ఆశాల న్యాయమైన సమస్యల పరిష్కరించకపోతే ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు, ప్రశ్నించడానికి వచ్చానని చెబుతున్న పవన్ కళ్యాణ్ వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల సమస్యలను ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే కార్మికులు ప్రత్యామ్నాయం కోసం ఆలోచించాల్సి వస్తుందన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.26వేలురిటైర్మెంట్ బెనిఫిట్స్, మెటర్నటీ లీవులు, ప్రభుత్వ సెలవులు, అర్హులకు ప్రమోషన్లు, పని భారం తగ్గింపు, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, గ్రాట్యుటీ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాకోడు పిహెచ్‌సి ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, నాయకులు సుజాత, గౌరీ సునీత, ఈశ్వరమ్మ, విజయనగరం అర్బన్ నాయకులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం రికవరీ చేయాలి : పీడీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

సిఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, పిఎంఎఫ్ఎంఇ, పిఎంఇజిపి తదితర రుణాలు తీసుకున్న లబ్ధిదారుల నుంచి వందశాతం రివకరీ చేయాలని డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి సిబ్బందికి సూచించారు. శుక్రవారం తమ కార్యాలయంలో అన్ని మండలాల సిబ్బందితో వివిధ అంశాలపైన సమీక్ష నిర్వహించారు. కాంపోనెంట్లుకు సంబంధించి మార్చితో ఆర్థిక సంవత్సరం పూర్తవుతుంది కాబట్టి ఈలోగా వందశాతం రికవరీలు చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. మొబైల్ బుక్ బుకింగ్ పైన సూచనలిచ్చారు. సమావేశంలో హార్టికల్చర్ అధికారి, జమదగ్ని కూడా పాల్గొని పిఎంఎఫ్ఎంఇ గ్రౌండింగ్‌పై తగు సూచనలు చేశారు.

స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లాలో నాలుగు చోట్ల స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌ల నియామకానికి, అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో కోరారు. నెలవారీ గౌరవ వేతనంపై విజయనగరం ఎక్సైజ్ కోర్టు, పార్వతీపురం, కొత్తవలస, సాలూరు కోర్టుల్లో నియామకం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత నమూనాలో ధరఖాస్తుతోపాటు, అవసరమైన సర్టిఫికేట్ల జెరాక్స్ కాపీలతో ఈనెల 22వ తేదీలోగా తమ దరఖాస్తులను జిల్లా న్యాయస్థానానికి అందజేయాలని సూచించారు. అర్హతలు, ఇతర వివరాల కోసం జిల్లా న్యాయస్థానం ముఖ్య పరిపాలనాధికారిని సంప్రదించాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఓటర్ల సవరణ దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల సవరణకోసం అందిన ఫారం 6, 7,8, డిస్పోజ్ చేయడానికి వారం రోజులు గడువు మాత్రమేనని, వారం దాటి పెండింగ్ ఉండకూడదని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఫారం 7 లు జిల్లా ఎన్నికల అధికారికి పంపాలని , మిగిలిన ఫారాలు ఇఆర్ఒ స్థాయి లో వారే పరిష్కరించాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల పనులపై సమీక్షించారు. పోలింగ్ స్టేషన్లో కనీస సదుపా యాలు ఉండాలని టాయిలెట్, రన్నింగ్ వాటర్ తదితర పనులను వెంటనే పూర్తి చేసి ఈనెల 15లోగా రిపోర్ట్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలవద్ద ఉన్నాయని, వాటితో పనులు చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల మార్పులు ఎక్కడైనా అనివార్యమైతే ఇఆర్ఒలు వారం లోగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో చర్చించి మార్పుపై ఎలాంటి ఫిర్యాదులు , సమస్యలు లేవని నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎన్నికల కమిషన్ ఒకసారి ఆమోదం ఇచ్చిన తర్వాత మార్చడానికి అవకాశం ఉండదని తెలిపారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ అనిత, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పులుంటే ఫిర్యాదు చేయండి

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

ప్రజాశక్తి-బొబ్బిలి

రీసర్వేలో తప్పులుంటే ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేసి సరి చేస్తామని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. బుడా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మూడో విడత రీసర్వే జరుగుతుందన్నారు. సర్వే రాళ్లను పాతి పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎంఐజి లేఅవుట్‌కు సాలూరు మున్సిపాలిటీలో భూసేకరణ పూర్తయిందన్నారు. బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాలిటీలో భూసేకరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఉన్నారు.

వీణల కేంద్రాన్ని సందర్శించిన జెసి

గొల్లపల్లిలోని బొబ్బిలి వీణల కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సందర్శించారు. వీణల తయారీపై కళాకారులను అడిగి తెలుసుకున్నారు. వీణల అమ్మకాలు, కళాకారుల జీవన స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. వీణల తయారీకి అవసరమయ్యే కలపను ప్రభుత్వం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వారు జెసిని కోరారు. కలప అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కలప సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని జెసి హామీ ఇచ్చారు.



వీణల తయారీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

ఇంటివద్దకే రేషన్ పంపిణీ

విజయనగరం : ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. స్థానిక కణపాక సాయినగర్ కాలనీలో ఎండియు వాహనం ద్వారా జరుగుతున్న రేషన్ సరుకుల పంపిణీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ సరుకుల పంపిణీపై ఆరా తీశారు. తూకాన్ని, నాణ్యతను తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న కార్డుల సంఖ్య, ఇస్తున్న సరుకుల గురించి ఆరా తీశారు. వేలిముద్రలు పడకపోతే, ఐరిష్ ద్వారా నిర్ధారించి సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ ఇచ్చే తేదీని వలంటీర్లు ముందుగానే కార్డుదారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే రేషన్ పంపిణీ జరిగే సమయంలో అక్కడ వలంటీర్లు ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌర సరఫరా అధికారి కె.మధుసూదనరావు, తాహశీల్దార్ రత్నం, సిఎస్‌డిటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ శాలకు కోలగట్ల పేరు దారుణం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 35వ వార్డులో కార్పొరేషన్ నిధులతో నిర్మించిన వ్యాయామశాలకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి తమ ఇంటి పేరును పెట్టుకోవడం ఆయన నియంతృత్వానికి నిదర్శనమని వైసిపి నాయకులు పిళ్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్ విమర్శించారు. శుక్రవారం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లయ్య నాయుడ్ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కోలగట్ల నియంతృత్వ ధోరణికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. 35వ డివిజన్ గతంలో పంచాయతీ పరిధిలో ఉండేదని, కార్పొరేషన్లో విలీనం తరువాత అక్కడ పంచాయతీ కార్యాలయం నిరుపయోగంగా ఉండడంతో స్థానిక యువత వ్యాయామ శాలగా వినియోగించుకునేవారని తెలిపారు. స్థానిక ప్రజల కోరిక మేరకు వ్యాయామ శాలను కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి చేశారన్నారు. అయితే ఎమ్మెల్యే వీరభద్రస్వామి తన ఇంటిపేరును జోడిస్తూ కోలగట్ల ఆరోగ్యాలయంగా కార్పొరేషన్ సమావేశంలో తీర్మానం చేయడాన్ని ఖండించారు. నియోజకవర్గంలో నియంత పాలన కొనసాగుతోందని ఆరోపించారు. విజయనగరం కీర్తిని దశదిశలా వ్యాప్తి చేసిన కోడి రామ్మూర్తి, కోరాడ నాగన్న వంటి మల్లయోధులు పేర్లు పెడితే ప్రజలు హర్షించేవారని, కోలగట్ల పేరు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కోలగట్ల పేరు తొలగించే వరకూ పోరాడతామని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, నాయకులు రౌతు చంటి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాల్లో కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు శుక్రవారం తెల్లవారుజాము నుంచి సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాలలో నెలకొన్న పారిశుధ్య పనితీరుపై నిశితంగా పరిశీలించారు. స్థానికుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయానికి పారిశుధ్య కార్మికులు విధులకు హాజరవుతున్నారా లేదా గమనించారు. అక్కడక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాలు పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహించారని పారిశుధ్య కార్మికులకు ప్రశ్నించారు. గాంధీ పార్కు పరిసరాలను పరిశీలించారు. గాంధీ పార్కు అభివద్ధి చేసినట్లయితే ప్రజలు మరింతగా వినియోగించుకుంటారని ఇంజనీరింగ్ అధికారులతో చెప్పారు. అయ్యన్నపేట, బాలాజీ నగర్,ట్యాంక్ బండ్ రోడ్డు ప్రాంతాలలో పర్యటించి పరిస్థితులను గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారి సమీక్షలలో తెలుసుకున్న అంశాలను పరిష్కరించే దిశగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా అవగాహన పెంచుకొని చెత్తాచెదారాలను కాలువలలో, ఆరుబయట ప్రాంతాలలో వేయకుండా చూడాలన్నారు. మరింత పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాలలో స్థానిక కార్పొరేటర్లు జివి రంగారావు, కడియాల రామకృష్ణ, వైసిపి నాయకులు శైలాడ సత్యనారాయణ, ఇన్చార్జి ఇఇ దక్షిణామూర్తి, డిఇలు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేట కుమ్మర వీధిలో ఉన్న స్వామి వివేకానంద పాఠశాలను ఆయన సందర్శించారు.

సిసి రహదారులు ప్రారంభం



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 34, 39 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభోత్సవాలు చేశారు. 14.35 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రహదారులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. గతంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రాంతాల్లో సైతం వాటర్ ట్యాంకులను నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చగలిగామన్నారు. నగరంలో రోజు విడిచి రోజు నీటి పంపిణీ చేస్తూ తాగునీటి ఇబ్బందులు పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జిలు డాక్టర్ వి ఎస్ ప్రసాద్, బొద్దాన అప్పారావు, డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు వింత ప్రభాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు బాలి ప్రతాప్, కార్పొరేటర్ జివి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానం రద్దు చేయాలి


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులకు అప్రెంటిస్ విధానం వద్దని అనేక సంవత్సరాలు పోరాడి రద్దు చేయించుకుంటే మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఆ విధానాన్ని అమలు చేసేందుకు పూనుకోవడం అన్యాయమని ఆప్టా జిల్లా అధ్యక్షులు ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. వెంటనే అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తమ వ్యతిరేకతను తెలియ చేస్తూ ముఖ్యమంత్రికి, విద్యా శాఖ మంత్రికి, రాష్ట్ర ఉన్నత అధికారులకు లేఖలు రాశామన్నారు. గత కొన్నేళ్లుగా ఉద్యోగాల భర్తీ చేయకుండా ఇప్పుడు రెండేళ్ల అప్రెంటీస్ విధానం పెట్టడం ఉపాధ్యాయ ఉద్యోగ అభ్యర్థులకు శరాఘాతంగా మారుతుందని అన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, ఆర్మ్‌డ్ రిజర్వు, హోంగార్డు విభాగాల్లో పని చేస్తున్న పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. పోలీసు వెల్ఫేర్ డే లో భాగంగా శుక్రవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఉద్యోగుల సమస్యలడిగి తెలుసుకున్నారు. ముగ్గురు కానిస్టేబుళ్లు హాజరై తమ వ్యక్తిగత, ఉద్యోగ, అనారోగ్య, శాఖాపరమైన సమస్యలను ఎస్‌పి దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎస్‌పి వారి సమస్యల పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.



సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌పి దీపిక



హౌసింగ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న హుదూద్ బాధితులు, సిపిఎం నాయకులు

హుదూద్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

హౌసింగ్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హుదూద్ బాధితులకోసం నిర్మించిన ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన హౌసింగ్ కార్యాలయం వద్ద బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ 2014లో హుదూద్ తుపాను బాధితులకు లంకాపట్నం వద్ద నిర్మించిన ఇళ్లను అప్పగించినా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇళ్లను 2019లో బాధితులకు అప్పగించినా నేటివరకు కరెంటు, మంచినీరు, వాడుకనీరు, మరుగుదొడ్లు వాడుక నీరులేక నివాసం ఉండలేని పరిస్థితి నెలకొందని అన్నారు. 2021 నవంబర్‌లో హుదూద్ ఇళ్ల వద్ద ముట్టడి కార్యక్రమం చేపడితే నెలరోజుల్లో సదుపాయాలు కల్పిస్తామని అధికారులు రాత పూర్వకంగా హామీ ఇచ్చారని,కానీ నేటికీ కల్పించలేదని అన్నారు. ఇప్పటికైనా మౌలిక వసతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం హౌసింగ్ పీడీకి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, జగదాంబ, శాంతమూర్తి, హుదూద్ కాలనీ అధ్యక్షులు కె.రమణమ్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సాధించిన పతకాలతో క్రీడాకారులు

వెయిట్ లిఫ్టింగ్‌లో కొండవెలగాడ ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అఖిల భారత మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ మహిళా వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ధర్మశాలలో ఈ నెల 7 నుంచి 9 వరకు ఆలిండియా ఇంటర్ జోనల్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. కొండవెలగాడకు చెందిన ఎస్.పల్లవి 64 కిలోల విభాగంలో స్నాచ్ 80, క్లీన్ జర్క్ 100 మొత్తం 180 కిలోల బరువెత్తి బంగారు పతకం సాధించింది. సిహెచ్ శ్రీలక్ష్మి 81 కిలోల విభాగంలో స్నాచ్ 83, క్లీన్ జర్క్ 102 మొత్తం 185 కిలోలు బరువెత్తి రజత పతకం కైవశం చేసుకుంది. బి.రాజేశ్వరి 45 కిలోల విభాగంలో స్నాచ్ 60, క్లీన్ జర్క్ 80 మొత్తం 140 కిలోల బరువెత్తి కాంస్య పతకం సాధించింది. వీరిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మీనాగనరేంద్ర, సెక్రెటరీ చల్లా రాము, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

అక్రమ కేసులు అన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ప్రజలపై వేసిన ఆస్తిపన్ను, చెత్తపన్నుకు వ్యతిరేకంగా నిరసన తెలిపితే అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. పన్నుల భారానికి వ్యతిరేకంగా 2021లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపితే ఆరుగురిపై అక్రమ కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిప్పడం దారుణమన్నారు. అక్రమ కేసులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రభుత్వం స్పందించి అక్రమ కేసులను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రజలపై వేసిన ఆస్తిపన్ను, చెత్తపన్నును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.ఇందిర, బి.గోపాల్ పాల్గొన్నారు.

ఓటర్ల సవరణకు అవకాశం

ప్రజాశక్తి-కొత్తవలస

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు ఓటర్ల సవరణకు అవకాశం ఉందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలో బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఫారం -6, 7, 8 క్లెయిమ్స్‌ను ప్రాసెస్ చేయాలని బిఎల్‌ఒలకు సూచించారు. సమావేశంలో తహశీల్దార్ సి.చంద్రశేఖర్, డిటిలు నారాయణమ్మ, టి.రమేష్, కోట అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

శివ్వాంలో విద్యుత్తు మరమ్మతులు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శివ్వాంలో సర్పంచ్ బొక్కేల లక్ష్మీనారాయణమ్మ, వైసిపి నాయకులు బొక్కేల వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యుత్తు మరమ్మతులు చేపట్టారు. రూ.1.50 లక్షల వ్యయంతో ఈ పనులు చేస్తున్నారు. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ భూమికి తక్కువ ఎత్తులో, ఇళ్ల మధ్యలో ఉండటంతోపాటు స్తంభాలు సరిగా లేకపోవడంతో కొన్నాళ్లుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచ్ స్పందించి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

తైక్వాండో పోటీలో బొబ్బిలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. విజయనగరంలో ఇటీవల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. అందులో బొబ్బిలి క్రీడాకారులు జి.చరిత, ఎస్.తేజేశ్వర్, బి.భరద్వాజ్, యు.సుసాన్ నేస్సి, డి.జాహ్నవి, డి.ఆదిత్య, యువకిశోర్ బ్లాక్ బెల్టులు సాధించారు. వీరిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అభినందించారు. కార్యక్రమంలో కోచ్ బంకురు ప్రసాద్ పాల్గొన్నారు.

పనుల బాధ్యత అధికారులదే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో చేపడుతున్న పనులను పూర్తిచేయాల్సిన బాధ్యత అధికారులదేనని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ స్పష్టంచేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కాలంలో పనులు పూర్తిచేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు కూడా బాధ్యత వహించాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఉమ, ఎపిఒ ఆదిలక్ష్మి, ఎపిఎం శ్రీనివాసరావు, ఎంఇఒ పి.బాలభాస్కరరావు, జి.జగదీశ్వరరావు, హౌసింగ్ ఎఇ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. భోజరాజపురం పంపు హౌస్‌ను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా నివారించేందుకు స్టాండ్‌బై మోటార్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేగావతి నదిలో ఇసుకతో గట్టు వేయాలని ఆదేశించారు. క్లోరినేషన్ సక్రమంగా చేయాలన్నారు. అనంతరం ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. ఆమెతో డిఇ కనకరాజు, ఎఇలు సురేష్, రవికుమార్ ఉన్నారు.

రాయితీపై పరికరాలు అందించాలి

బొండపల్లి : రైతులకు రాయితీపై వ్యక్తిగత పరికరాలు అందించాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు తాళ్లపూడి కృష్ణ కోరారు. శుక్రవారం నెలివాడ లో ఆర్‌బికెలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు అధికశాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పివి.మల్లికార్జున రావు, కమిటీ సభ్యులు లెంక అప్పారావు, కోరాడ సత్యనారాయణ, సుంకరి శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన పిల్లల ఆరోగ్యానికి రక్ష

డిఎంహెచ్‌ఒ భాస్కరరావు • జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో డి-వార్మింగ్ డే



విజయనగరంలో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిల్లల కడుపులో చేరిన నులిపురుగులను ఒక ఆల్బెండజోల్ మాత్రతో నిర్మూలించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లల ఆరోగ్యానికి రక్షణ కల్పించవచ్చన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 19 ఏళ్ల లోపు వయసు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చి మింగించే కార్యక్రమం అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చేపట్టారు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో వున్న నగరపాలక సంస్థ మున్సిపల్ హైస్కూలులో డిఎంహెచ్‌ఒ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. పిల్లల కడుపులో నులిపురుగుల చేరడం వల్ల వారు రక్తహీనత, నీరసం వంటివి ఏర్పడి వారు చదువుపై ఏకాగ్రత, శ్రద్ధ చూపలేరని పేర్కొన్నారు. 19 ఏళ్ల లోపు వయస్సుగల వారందరికీ ఒకేసారి మాత్రలు మింగించడం ద్వారా ఈ పురుగులను వ్యాప్తిచేసే బాక్టీరియాను నిర్మూలించ వచ్చన్నారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆహారం తీసుకునే ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవడం వంటి మంచి అలవాట్ల ద్వారా 95శాతం నోటి ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చన్నారు.

జిల్లాలో 4,834 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థల ద్వారా 3.80 లక్షల మందికి ఈ మాత్రలు పంపిణీచేసి భోజన అనంతరం ఒకేరోజున మింగించే ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ పి.రవికుమార్, డిపిఆర్‌ఒ డి.రమేష్, ఎంఇఒ సత్యవతి, వైద్యాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న మండల ప్రత్యేకాధికారి

వేపాడ : డివార్మింగ్ డే సందర్భంగా మండలంలో చేపట్టిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. వేపాడ హైస్కూల్లో విద్యార్థులకు జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు మాత్రలు మింగించారు. వేపాడ పిహెచ్‌సి పరిధిలో 4352 మంది చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, పిహెచ్‌సి వైద్యాధికారులు ఎ.ధరణి, తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్, ఇఒపిఆర్‌డి ఉమ, ఎంఇఒ పి.బాల భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీవల్లి, సిహెచ్‌ఒ ఆంజనేయులు పాల్గొన్నారు,

డెంకాడ : మండలంలోని పెదతాడివాడ హైస్కూల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వైద్యులు రాజ్‌కుమార్ పంపిణీ చేశారు. డెంకాడ పిహెచ్‌సి పరిధిలో 6464 పిల్లలకు గాను 6386 మంది ఆల్బెండజోల్ మాత్రలు అందించినట్లు తెలిపారు.

తెర్లాం : తెర్లాం హైస్కూల్లో విద్యార్థులకు ఎంపిడిఒ మధుసూదనరావు, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, వైద్యాధికారి దివ్యభారతి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

చీపురుపల్లి : స్థానిక గురుకుల పాఠశాలలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్లాం పిహెచ్‌సి వైద్యులు వి.సువర్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పతివాడ రాజారావు, ప్రిన్సిపల్ రాణిశ్రీ, రామలింగాపురం సొసైటీ మాజీ అధ్యక్షుడు రేవళ్ల సత్తిబాబు, వార్డు సభ్యులు మజ్జి శంకర్, చీపురుపల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కో -కన్వీనర్ ప్రభాత్ కుమార్ పాల్గొన్నారు.



చీపురుపల్లి.. విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తవలస : గురుకులం, హై స్కూల్‌లో ప్రిన్సిపల్ టి.జయశ్రీ, ప్రధానోపాధ్యాయులు జి.సాంబశివరావు ఆధ్వర్యంలో వైద్యాధికారి గోపాలకృష్ణ విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. 4887 మందికి గాను 4795 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, హెచ్‌ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్‌ఎం భవాని, స్టాఫ్ నర్స్ దీప పాల్గొన్నారు.

తాటాకు చప్పుళ్లకు భయపడం

మిమ్స్ యాజమాన్యానికి స్పష్టంచేసిన ఎండబ్ల్యుఐయు



కార్మికులు, ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న టివి రమణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్య తాటాకు చప్పుళ్లకు ఉద్యోగులు, కార్మికులు భయపడరని మిమ్స్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ స్పష్టం చేశారు. స్థానిక ఆర్‌ఒబి వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యాన మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన నిరసన శిబిరం శనివారం పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా శిబిరంలో రమణ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం బెదిరింపులకు తలొగ్గే పరిస్థితి లేదన్నారు. మిమ్స్ యాజమాన్యం ట్రేడ్ యూనియన్ నాయకులతో చర్చలు జరపబోమని చెప్పడం అర్థ రహితమన్నారు. సిఐటియు నాయకత్వం లేకుంటే ఉద్యోగులు, కార్మికుల నోళ్లు నొక్కి, డిఎలు, వేతన ఒప్పందం ఎగ్గొట్టవచ్చని మిమ్స్ యాజమాన్యం ఎత్తుగడ వేసిందన్నారు. సిఐటియు నాయకత్వం, మిమ్స్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్‌తో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ పోరాటానికి ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. శిబిరంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు మిరప నారాయణ, కర్రోతు కాము నాయుడు, మహంతి నాగభూషణం, వి.అప్పలనాయుడు, టి.రామకృష్ణ, కె.నాగేశ్వరరావు, జి.వరలక్ష్మి, బి.బంగారు నాయుడు, వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం 40 ఏళ్లు వెనక్కి



గాజులరేగలో పర్యటిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి

ప్రజాశక్తి- విజయనగరం కోట

వైసిపిపాలనలో రాష్ట్రం 40 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు అన్నారు. బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె గాజులరేగలో పర్యటించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రాన్ని కాపాడాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. వైసిపికి ఒక్క ఛాన్స్ అని అవకాశం ఇచ్చి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని 40 ఏళ్ళు వెనక్కి నెట్టి అంధకారంలోకి తీసుకువెళ్లిన జగన్ పాలనను అంతమొందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్తె, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు , కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, స్థానిక నాయకులు ఆల్తి వరలక్ష్మి పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి పేరిట దగా

బాడంగి : అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీలు గుప్పించిన జగన్.. కేవలం 6,100 పోస్టులతో డిఎస్‌సి ప్రకటించడం దారుణమని కొప్పలవెలమ సాధికార సమితి విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస గౌరు అన్నారు. శుక్రవారం బాడంగిలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 26 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మెగా డిఎస్‌సి అంటూ పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. నిరుద్యోగులపై జగన్ సర్కారుకు నిజమైన ప్రేమ ఉంటే 26 వేల ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏటా జనవరి ఒకటో తేదిన జాబ్ కేలండర్ విడుదల చేస్తానని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడతామని చెప్పి నాలుగున్నరేళ్లు గడిచినా అతీగతీ లేదని దుయ్యబట్టారు.

హెచ్‌ఐవి బాధితులకు కుటుంబ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో హెచ్‌ఐవి ఉన్న గర్భిణులు, బాలింతలకు కుటుంబ నియంత్రణపై సాధీ ఎన్‌జిఒ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం సర్వజన ఆస్పత్రిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్షయ, ఎయిడ్స్ నివారణ అధికారి కె.రాణి మాట్లాడుతూ మహిళలు మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. కాన్పుకు,కాన్పుకు దూరం ఉండాలని, కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనీల సునందని మాట్లాడుతూ హెచ్‌ఐవి గర్భిణులు ఆరోగ్యం కాపాడుకుంటూ పిల్లలను కనాలని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని, కుటుంబ నియంత్రణ చేయించుకోవాలని వివరించారు. ఎఆర్‌టి వైద్యాధికారి డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ హెచ్‌ఐవి ఉన్న గర్భిణులు క్రమం తప్పకుండా ఎ.ఆర్.టి మందులు వాడాలని, రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. విఎన్‌పి ప్లస్ అధ్యక్షులు జికె చౌదరి మాట్లాడుతూ హెచ్‌ఐవి ఉన్న గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రులలో కుటుంబ నియంత్రణ సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజరు ఎన్. సాక్షి గోపాలరావు, సాధీ ఎన్‌జిఒ పిఒ డివి సత్యనారాయణ, డిఎస్‌ఆర్‌సి, ఎఆర్‌టి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగలో శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత ఎ.శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం డిల్లీశ్వరరావు ఆస్పత్రి వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుండి వందల సంఖ్యలో రోగులు హాజరయ్యారు. వారికి బిపి, షుగరు, ఆయాసం, జ్వరం, దగ్గు, ఊపిరితిత్తులు తదితర సమస్యలపై పరీక్షలు చేశారు. పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ, వెంపడాం మాజీ సర్పంచులు పి.సన్యాసినాయుడు, శ్రీనివాసరావు, వైద్యులు అక్కేన సుధామాధురి, సతీష్, కిశోర్ , డిల్లీశ్వరరావు, నాయకులు కొరటాన ప్రసాదరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

బొండపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపిపి చల్ల చలంనాయుడు తెలిపారు. మండలంలో బి.రాజేరు గ్రామంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. బొండపల్లి హైస్కూల్లో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఎంపిపి ప్రారంబించారు. ఈ కార్యక్రమాలలో ఎంపిడిఒ ఎస్.హరిహరరావు, సర్పంచ్ ఈదిబిల్లి కృష్ణ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఆత్మగౌరవం ఢిల్లీలో తాకట్టుపెట్టారు

లోక్‌సత్తా అధ్యక్షులు భీశెట్టి బాబ్జి

ప్రజాశక్తి - జామి

ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ పదవి లేని బిజెపి పార్టీ ముందు రాష్ట్రంలోని అన్ని పార్టీలూ చతికిల పడి తెలుగు జాతి గౌరవం దిగజార్చేలా వ్యవహరిస్తున్నాయని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం జామిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలను కేంద్రంలోని బిజెపి తన చేతిలో పెట్టుకొని తొలుబొమ్మలాట ఆడిస్తోందని విమర్శించారు, బిజెపి చేతిలో టిడిపి, జనసేన, వైసిపి కీలుబొమ్మలుగా మారిపోవడం వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం చేసినా అడగలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఈ మూడు ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యక్తిగత ప్రయోజనం కోసం రాష్ట్రాన్ని, ప్రజల భవిష్యత్తును సమూలంగా తాకట్టుపెట్టాయని అన్నారు. గత ఐదేళ్లగా రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తి కాక, పరిశ్రమలు లేక రైతులు,యువత పెద్ద ఎత్తున ఉపాధి కోల్పోయినా ప్రధాన రాజకీయ పార్టీలకు కనీసం పట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఈ తరహా రాజకీయాలు ఉంటే యువతకు ఏమి సందేశం ఇచ్చినట్లని అన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు.



నిరసన తెలుపుతున్న చోడవరం గ్రామస్తులు

కాలుష్యం నుంచి విముక్తి కల్పించండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సిపి ఆక్వా పరిశ్రమ కాలుష్యం నుంచి తమకు విముక్తి కల్పించాలని మండలంలోని చోడవరం గ్రామస్తులు మాజీ సర్పంచి నల్ల అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఒ రాధిక, తహశీల్దార్ ప్రవల్లికకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ వల్ల తమ ప్రాంతంలో గాలి, నీరు, భూములు కలుషితం అయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే కాలుష్యం నుంచి తమను కాపాడాలని కోరారు. పరిశ్రమలో సుమారు 6 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. తమ గ్రామంలో కంపెనీ పెట్టి తమకు ఉపాధి లేకుండా చేసే పరిశ్రమకు తామెందుకు సహకరించాలని ప్రశ్నించారు. సమస్యలను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పడంతో వారు వెనుదిరిగారు.

మాట్లాడే విధానం నేర్చుకో..

నాగార్జునకు వైసిపి సూచన

ప్రజాశక్తి-చీపురుపల్లి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మాట్లాడే విధానం మార్చుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక వైసిపి నాయకులతో కలిసి వారు మాట్లాడారు. పాతికేళ్లపాటు మంత్రి పదవులు వెలగ బెట్టిన కిమిడి నాగార్జున కుటుంబీకులు కనీసం సొంత గ్రామానికి న్యాయం చేయలేదన్నారు. అలాంటిది తాను గెలిస్తే చీపురుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని నాగార్జున గొప్పలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యారంగంలో సంస్కరణలు తీసుకువచ్చి పేదలకు న్యాయమైన విద్యనందిస్తున్న బొత్స సత్యనారాయణ గురించి మాట్లాడే నైతిక హక్కు నాగార్జునకు లేదని హితవు పలికారు. నాగార్జున తల్లి మృణాళిని మంత్రిగా ఉన్నప్పుడు చీపురుపల్లి నియోజకవర్గానికి ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బొత్స సత్యనారాయణ మంత్రిగా అయిన తరువాత పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు, ప్రతి గ్రామానికి హెల్త్ క్లినిక్‌లు, చీపురుపల్లికి వంద పడకల ఆసుపత్రి వంటివి తీసుకొచ్చారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పతివాడ రాజారావు, రేవల్ల సత్యనారాయణ, కర్రోతు రమణ, చందక గురునాయుడు, మీసాల సీతారాం, ఎల్.ప్రభాత్, జనార్ధన్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఎంఇఒ బాలభాస్కరరావు పరిశీలించారు. కేంద్రంలో సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించడంపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ పరిశీలనలో సిఆర్‌పిలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాల రికార్డులను, విద్యార్థులకు సంబంధించిన వర్క్‌బుక్‌లను, రోజువారి ఇస్తున్న మెనూ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు చిరంజీవి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గజపతినగరం : అగ్ని ప్రమాదాలపై అందరికీ అవగాహన అవసరమని అగ్నిమాపక కేంద్రం అధికారి రవిప్రసాద్ అన్నారు.మడలంలోనిపురిటిపెంటలో క్లాత్ వాషింగ్ ఇండస్ట్రీలో అగ్నిప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బెల్ట్‌షాపులపై దాడులు

వంగర : మండలంలో వివిధ గ్రామాల్లో బెల్ట్‌షాపులపై ఎస్ఐ వైవి జనార్ధన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అరసాడలో ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తూ 26 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. వాటిని స్వాధీనం చేసుకుని, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఆకట్టుకున్న కళాజాతా

రామభద్రపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భేటీ పడాఓ భేటీ బచావో పథకంపై కళాజాత బృంద ప్రదర్శన ఆకట్టుకుంది. శుక్రవారం స్థానిక వసంతుల వీధిలో ఆడ పిల్లలను చదివిద్దాం..ఆడపిల్లలను రక్షిద్దాం అంటూ శివశంకర బుర్రకథ దళం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. బాడంగి సిడిపిఒ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలతో పాటు అంగన్వాడీ పర్యవేక్షకులు సూర్యకుమారి, రత్నకుమారి, కృష్ణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.